క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి శివారు రంగంపల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతు పనుల కారణంగా ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయముంటుందని ఏఈ శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం..

కాల్వశ్రీరాంపూర్: మండలంలో ఆదివారం పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నట్లు సింగిల్‌విండో చైర్మన్ చదువు రాంచంద్రారెడ్డి, సీఈవో కోలేటి శ్రీనివాస్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. అంకంపల్లి, మడిపెల్లికాలనీ, పాతమడిపెల్లి, ఆశన్నపల్లె, పెగడపల్లి, కాల్వశ్రీరాంపూర్, ఇప్పలపల్లె, తారుపెల్లి, మల్యాల గ్రామాల్లో ప్రారంభించే కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి అధికారులు, రైతులు, నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

లక్ష్మీనర్సింహస్వామి రథోత్సవం..

జూలపల్లి: పెద్దాపూర్ శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామికి రథోత్సవం నిర్వహించేందుకు ఆలయ ఈవో సదయ్య ఏర్పాట్లు చేశారు. గుట్ట ముందున్న వీధుల్లో శోభాయాత్ర నిర్వహిస్తారు.

బీఆర్‌ఎస్ సభకు తరలిరండి

జూలపల్లి: బీఆర్‌ఎస్ ఆవిర్భవించి 25 ఏళ్లు అవుతున్న సందర్భంగా ఈనెల 27న నిర్వహించే రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలో శనివారం సభ ప్రచార పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతీ గ్రామం నుంచి రైతులు, యువకులు స్వచ్ఛందంగా తరలివచ్చేలా అవగాహన కల్పించాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. నాయకులు కంది చొక్కారెడ్డి, తమ్మడవేని మల్లేశ్ యాదవ్, కత్తెర్ల శ్రీనివాస్, లాల్‌మహ్మద్, నాడెం మల్లారెడ్డి, తొగరు శ్రీనివాస్, పొలగాని సతీశ్, మేర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు స్థానిక అచలర్ష శ్రీరాజయోగి ఆశ్రమ అధిపతి గురువు కన్నం సత్యనారాయణను దాసరి పరామర్శించారు. సత్యనారాయణ తల్లి లచ్చవ్వ ఇటీవల మృతిచెందారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

పెద్దపల్లిరూరల్: రైతులు పండించిన వరి ధాన్యాన్ని మద్దతు ధరపై కొనుగోలు చేసేందుకు అవసరమైన కేంద్రాలను ప్రారంభించాలని సహకార సంఘ మాజీ డైరెక్టర్ మాదారపు వేణుగోపాలరావు కోరారు. పెద్దపల్లి ప్రాంతంలోని పలు గ్రామాల రైతులు ధాన్యాన్ని తెచ్చి కేంద్రాల వద్ద కుప్పలు పోసి పడిగాపులు పడుతున్నారని పేర్కొన్నారు. వీలైనంత త్వరగా కేంద్రాలను ప్రారంభించి నిబంధనల మేరకే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు.

దరఖాస్తు గడువు పొడిగించాలి

కోల్‌సిటీ: రాజీవ్ యువ వికాసం గడువును మరో 10 రోజులపాటు పొడిగించాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మార్కపురి సూర్య డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశం కింద రుణాలు మంజూరు చేసేందుకు ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం రెండు రోజులుగా సర్వర్ డౌన్ సమస్యలతో పని చేయడం లేదని, దీంతో చాలామంది అర్హులు దరఖాస్తు చేసుకోలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దరఖాస్తు చేసుకునే గడువును పొడిగించడంతోపాటు తహసీల్ కార్యాలయాల్లో కుల, ఆదాయ, ధ్రువీకరణ పత్రాలను వెంటనే జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అవయవ దానంతో మరొకరి జీవితంలో వెలుగులు



అవయవ దాత కుటుంబానికి ప్రశంసాపత్రం అందజేత

రామగుండం: అవయవ దానంతో మరొకరి జీవితంలో వెలుగులు నింపొచ్చని, ప్రతీ ఒక్కరు తమ మరణానంతరం అవయవ దానం చేయాలని భారతీయ జనతా పార్టీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి అన్నారు. లింగాపూర్ గ్రామంలో ఇటీవల తోట రాజయ్య మృతిచెందారు. ఆయన కుటుంబీకులు అవయవ దానం చేయడంతో అభినందించారు. శుక్రవారం రాత్రి మృతుడి కుటుంబీకులకు సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రశంసాపత్రం అందజేశారు.

ధాన్యం పోసేందుకు స్థలం కావాలని..



జూలపల్లి: మండలంలో వరి కోతలు మొదలయ్యాయి. కోసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో పోసేందుకు రైతులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. పెద్దాపూర్ ఆదర్శ విద్యాలయం వద్ద ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు ముందస్తుగా స్థలం కోసం తమ ఇంటి నుంచి తెచ్చిన చీరలను ఇలా పరిచారు. రోడ్డు వెంట వెళ్లేవారికి చీరలు ఆరేసినట్లు కనిపిస్తున్నాయి.

చర్మ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సుల్తానాబాద్: విద్యార్థులు చర్మ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఉదయ్‌కుమార్ సూచించారు. శనివారం పట్టణంలోని శాస్త్రినగర్ సోషల్ వెల్ఫేర్ బాలుర హాస్టల్‌లో 322 మంది విద్యార్థులకు వైద్యశిబిరం నిర్వహించారు. ప్రిన్సిపాల్ కృష్ణమాచార్య, ఎంఎల్‌హెచ్‌పీ సమీరా, సూపర్‌వైజర్ వెంకట్‌రెడ్డి, పీహెచ్‌ఎన్ భారతి, ఏఎన్‌ఎంలు వినోద, శారద తదితరులు పాల్గొన్నారు.

తొలితరం ఆదర్శ కమ్యూనిస్టు నేత కాంతారావు



ఎలిగేడు: తొలితరం ఆదర్శ కమ్యూనిస్టు నేత తానిపర్తి కాంతారావు అని సీపీఐ జాతీయ కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన స్వాతంత్య్ర సమరయోధుడు, కమ్యూనిస్టు నాయకుడు కాంతారావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. చాడ వెంకట్‌రెడ్డితో కలిసి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కామ్రేడ్ కలవేన శంకర్, సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్, మంచిర్యాల జిల్లా కార్యదర్శి మేకల దాస్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళి అర్పించారు. మాజీ సర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి



రామగుండం: శ్రీభక్తాంజనేయస్వామి దేవాలయంలో..



జ్యోతినగర్: టీటీఎస్‌లోని శ్రీభక్తాంజనేయస్వామి దేవాలయంలో..

జైబోలో హనుమాన్‌కి.. రామలక్ష్మణజానకి.. జైశ్రీరాం.. జైహనుమాన్ అంటూ శనివారం భక్తులు జిల్లాలో స్మరణ చేశారు. హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు పెట్టారు. అన్నదానం చేశారు. స్వాములు తదితరులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



సుల్తానాబాద్‌లోని హనుమాన్ ఆలయంలో..



జ్యోతినగర్: పూజలు చేస్తున్న స్వాములు



ఆర్‌ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్‌లోని హనుమాన్ దేవాలయంలో..



యైటింక్లయిన్‌కాలనీ: ఆలయంలో భక్తులు



కాల్వశ్రీరాంపూర్ ఆంజనేయస్వామి ఆలయంలో..

సింగరేణి వార్తలు

హెచ్‌ఎంఎం అర్హత గడువులో సడలింపు ఇవ్వాలి



జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గోదావరిఖని: హెచ్‌ఎంఎం అర్హత గడువులో సడలింపు ఇవ్వాలని టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం ఆర్జీ–2 జీఎం బండి వెంకటయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆర్జీ–2 ఏరియాలోని ఓసీపీ–3 ప్రాజెక్టులో 2023–24 సంవత్సరానికి సంబంధించిన యాక్టింగ్ ప్రమోషన్, టెస్ట్ ప్రమోషన్లో భాగంగా హెచ్‌ఎం ఎం మజ్దూర్ 62 పోస్టులు మంజూరయ్యాయన్నారు. దీనికి గతేడాది ఆగస్టు చివరినాటికి మూడేళ్ల సర్వీసు అర్హతగా నిర్ణయించారని అన్నారు. వీరిలో 30 మంది కార్మికులు మాత్రమే అర్హత సాధిస్తున్నారని, అర్హత గడువు పొడిగిస్తే అందరికి అర్హత వచ్చి 62 పోస్టులు భర్తీ అవుతాయన్నారు. మహాకవి పోతన కాలనీలోని సబ్ స్టేషన్‌లో ఎలక్ట్రికల్ సిబ్బందిని నియమించాలని అన్నారు. నాయకులు అబ్బు శ్రీనివాస్‌రెడ్డి, మామిడి తిరుపతి, ముస్కుల అనిల్‌రెడ్డి, ధరణి మల్లేశ్వర్‌రావు, కమలాకర్‌రెడ్డి, చంద్రశేఖర్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతి ఏర్పాట్లు పరిశీలన



పరిశీలిస్తున్న ఆర్జీ–3 ఇన్‌చార్జి ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ

రామగిరి: ఈనెల 14న ఆర్జీ–3, ఏపీఏ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంబేడ్కర్ జయంతి ఏర్పాట్లపై ఆర్జీ–3 ఇన్‌చార్జి ఎస్‌వోటూ జీఎం బి.వి.సత్యనారాయణ పరిశీలించారు. సెంటినరికాలనీ రాణిరుద్రమదేవి క్రీడాప్రాంగణంలోని సీఈఆర్ క్లబ్, అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. నిర్దేశించిన పనులు, ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వేడుకలకు హాజరయ్యేవారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. ఉద్యోగులు, అధికారులు, వారి కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. సివిల్ డీజీఎం రాజేంద్రకుమార్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, అధికారులు గుర్రం శ్రీహరి, వి.సునీల్‌ప్రసాద్, రాజేంద్రప్రసాద్, ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతికి ఏర్పాట్లు పూర్తి

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహంతో పాటు ఆవరణలో రంగులు వేశారు. విగ్రహంతోపాటు చుట్టుపక్కల పలు రకాల రంగులు వేసి పూర్తి చేసినట్లు మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ నియాజ్ తెలిపారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద రంగులు వేస్తున్న మున్సిపల్ సిబ్బంది

భారత రాజ్యాంగ పరిరక్షణ యాత్ర

రామగుండం: భారత రాజ్యాంగ పరిరక్షణ యాత్రలో భాగంగా కాంగ్రెస్ కేంద్ర కమిటీ పిలుపు, స్థానిక ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఠాకూర్ ఆదేశాల మేరకు శనివారం పార్టీ శ్రేణులు జైబాపు, జైభీం, జైసంవిధాన్ పేరుతో రామగుండంలో ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఈదునూరి హరిప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతీ పౌరుడి స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను హరించేలా బీజేపీ వ్యవహరిస్తోందన్నారు. ఇసంపెల్లి అంజులు, మహ్మద్ ఉస్మాన్ షరీఫ్, ఎండీ సలీంబేగ్, బొద్దుల శంకర్, మొయిన్, అఫ్సర్, సిరిశెట్టి సతీశ్‌గౌడ్, సాదు రమేశ్ తదితరులున్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కాంగ్రెస్ చేపట్టిన జైబాపు, జైభీం, జైసంవిధాన్ కార్యక్రమంలో భాగంగా దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాపాడుకుందామంటూ యైటింక్లయిన్‌కాలనీ కాంగ్రెస్ నాయకులు రాజ్యాంగ పరిరక్షణ యాత్రను శనివారం చేపట్టారు. పెద్దపల్లి జిల్లా వైస్ ప్రెసిడెంట్ మారెల్లి రాజిరెడ్డి, కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్, మాజీ కార్పొరేటర్లు శంకర్‌నాయక్, సాగంటి శంకర్, మార్క రాజు, చక్రపాణి, తిరుపతిరెడ్డి, రాములు, సాగర్, హరిహర, కేశవులు, యాదగిరి తిరుపతి, కుమార్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.



రామగుండం: అంబేడ్కర్ కూడలి వద్ద కాంగ్రెస్ శ్రేణులు

వరి కోతలు ప్రారంభం



ప్రారంభానికి ముందే కొనుగోలు కేంద్రంలో ధాన్యం నిల్వలు

పాలకుర్తి: మండల పరిధిలోని గ్రామాల్లో యాసంగి సీజన్ వరి కోతలు ప్రారంభమయ్యాయి. అధికారిక లెక్కల ప్రకారం మండలవ్యాప్తంగా మొత్తం 8,750 ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేయగా.. 3,464 ఎకరాల్లో సన్న రకం, దొడ్డు రకం 4,234 ఎకరాలు, సీడ్ ప్రొడక్ట్‌కు సంబంధించి 1,052 ఎకరాల్లో సాగు చేశారు. 82,275 క్వింటాళ్ల సన్న రకం ధాన్యం, 1,18,553 క్వింటాళ్ల దొడ్డు రకం ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రానున్నట్లు అధికారులు అంచనాలు రూపొందించారు. గ్రామాల్లో వరి కోతలు పూర్తి చేసిన రైతులు తమ ధాన్యాన్ని బసంత్‌నగర్ విమానాశ్రయ ప్రతిపాదిత స్థలంలోని కొనుగోలు కేంద్రాలకు తరలించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరితగతిన ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

బీజేపీ బస్తీ చలో

ఓదెల: బీజేపీ రాష్ట్ర పిలుపు మేరకు పొత్కపల్లి గ్రామంలో బస్తీ చలో కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. శివాలయం శుభ్రం చేశారు. బీజేపీ మండల ఇన్‌చార్జి కొమ్ము తిరుపతి, స్థానిక నాయకులు తూడి రాజేందర్, తీర్థాల కుమార్, పుల్లూరి పృథ్వీరాజ్, ఎంబాడి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామగుండం: బీజేపీ మండల అధ్యక్షుడు బోడకుంట సుభాష్ నేతృత్వంలో విసంపేట గ్రామంలోని దాసాంజనేయస్వామి ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. బాలసాని సత్యంగౌడ్, మాడ అనిల్‌రెడ్డి, పసుల రాజశేఖర్, మట్ట విష్ణురెడ్డి, కాంపెల్లి లింగయ్య తదితరులున్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: యైటింక్లయిన్‌కాలనీ బీజేపీ నాయకులు 19వ డివిజన్ న్యూమారేడుపాక గ్రామంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా ఆలయ ఆవరణతోపాటు ఆలయం చుట్టుపక్కల పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను తొలగించారు. మూకిరి రాజు, శ్రీనివాస్, శశికుమార్, దాసరి శ్రీనివాస్, లింగంనాయక్, లక్ష్మీనారాయణ, వెంకటి, అనిల్‌కుమార్, శంకర్, బాలయ్య, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.



పొత్కపల్లిలో శివాలయం శుభ్రం చేస్తున్న బీజేపీ నాయకులు

'డయల్ యువర్ డీఎం'కు స్పందన

మంథని: స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలో శనివారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి మంచి స్పందన వచ్చింది. వివిధ ప్రాంతాల నుంచి ప్రయాణికులు పలు సమస్యలను డీఎం శ్రావణ్‌కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. మంథని, జమ్మికుంట నుంచి ఓడేడుకు బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలని కోరారు. కరీంనగర్ నుంచి మంథనికి రాత్రి 10 గంటల తర్వాత పల్లెవెలుగు బస్సును నడుపాలని, హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌కు కొత్త బస్సును నడిపించాలని, పెద్దపల్లి నుంచి మంథనికి ఉదయం 9 గంటలకు ట్రిప్ టైంకు బస్సు నడిపించాలని, మంథని నుంచి వేములవాడకు పెద్దపల్లి, జూలపల్లి, చొప్పదండి మీదుగా బస్సులు నడిపించాలని ప్రయాణికులు కోరారు. ఆ సమస్యలను సాధ్యమైనంత వరకు పరిష్కరిస్తామని డిపో మేనేజర్ తెలిపారు.

సెలవుల్లో దరఖాస్తులు స్వీకరణ



సుల్తానాబాద్‌లో దరఖాస్తు స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్

సుల్తానాబాద్: ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో సెలవు దినాలైనా.. యువకుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ నియాజ్, ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన సిబ్బంది దరఖాస్తులను స్వీకరించారు. నిరుద్యోగులకు స్వయం ఉపాధి పథకాల కోసం ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం అమల్లోకి తెచ్చింది. ఈనెల 14 వరకు దరఖాస్తుల స్వీకరణ అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. మూడు రోజులు సెలవు దినాలు కావడంతో.. నిరుద్యోగ యువత, నిరుద్యోగులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు కార్యాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. ఆన్‌లైన్ సెంటర్లలో నిరుద్యోగులకు ప్రభుత్వ సైట్ పని చేయకపోవడంతో నిరుద్యోగులు స్వయం ఉపాధి పథకాల కోసం మీసేవతోపాటు ఇంటర్నెట్ సెంటర్లకు వెళ్లి నిరీక్షించినా అప్‌లోడ్ కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. దరఖాస్తు గడువును పెంచాలని యువత ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

అక్రమంగా మట్టి తరలింపు



సుల్తానాబాద్: పట్టణంలోని సుభాష్‌నగర్ చర్చి సమీపంలో మట్టి డంపును రాత్రివేళల్లో ఏర్పాటు చేసుకున్నారు. శనివారం ఉదయం అక్రమంగా నిల్వ చేసిన మట్టిని నూతనంగా నిర్మాణం చేసుకుంటున్న గృహాలకు తరలించి జేసీబీ నిర్వాహకులు అక్రమార్జనకు పాల్పడుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ, పోలీస్, భూగర్భ గనుల శాఖ అధికారుల కళ్లుగప్పి దందా నడిపిస్తున్నారు. మండలంలోని పలు ప్రాంతాలు, వివిధ మండలాల నుంచి మట్టిని తీసుకొచ్చి పట్టణంలో నిల్వ చేసి మట్టి దందాకు జేసీబీ యాజమాన్యం పాల్పడుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



యైటింక్లయిన్‌కాలనీ: బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని స్థానిక సెక్టార్–3 సింగరేణి పాఠశాల విద్యార్థులకు శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అంబేడ్కర్ దేశానికి, సమాజానికి చేసిన కృషి అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో దాదాపు 50 మంది విద్యార్థులు హాజరయ్యారు. గెలుపొందిన విద్యార్థులకు అంబేడ్కర్ జయంతి సందర్భంగా బహుమతులు అందజేయనున్నట్లు హెచ్‌ఎం సుందర్‌రావు తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.